మహిళలకు రాజకీయ ప్రాధాన్యత

మేటి మహిళలకు సత్కార మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



సైకాలజిస్ట్ శర్వాణిని సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, శ్రీకాంత్, మహిళా ప్రముఖులు

తెనాలి: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. తెనాలి బ్రాహ్మణ పరిషత్ , ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీ బీఎస్ఎస్ఎస్) సంయుక్తంగా ఆదివారం స్థానిక మూల్పూరు సుబ్రహ్మణ్య కల్యాణ మండపంలో మేటి మహిళలకు సత్కార మహోత్సవం నిర్వహించాయి. ఏపీ బీఎస్ఎస్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నిట్టల శైలజ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ.. చదువు, ఉద్యోగాలు, రాజకీయ రంగంలో మహిళలు తమదైన ప్రతిభతో వెలిగిపోతున్నారని చెప్పారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని అవకాశాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత ప్రాధాన్యం కల్పించారని, 134 కార్పొరేషన్లలో 70 పైగా కార్పొరేషన్లకు మహిళలే సారథులని తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేషన్ డైరెక్టర్లుగా మహిళలు ఇద్దరుంటే అందులో ఒకరు తెనాలి వారేనని గుర్తుచేశారు. దేవదాయ, ధర్మదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ.. బ్రాహ్మణులు రాజకీయంగా ఎదిగి, సంఘీయులు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులకు తగిన ప్రాతినిధ్యం ఇస్తోందని చెప్పారు. విశాఖలో బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీతంరాజుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తొలి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు.

విశాఖకు చెందిన సైకాలజిస్ట్ దుర్వాసుల శర్వాణి మాట్లాడుతూ.. సనాతులైన బ్రాహ్మణులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. సమాజానికి బ్రాహ్మణులు ఎంతో మేలు చేశారని, వారిని రాజకీయాల్లోకి తీసుకొస్తే రాజ్యానికి మేలు చేస్తారని అన్నారు. తెనాలి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ మహిళా ప్రముఖులు అవధానుల హిమబాల, త్రిపురారిభట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ, నర్సాపూర్ కౌన్సిలరు కస్తూరి ఇందిరాదేవి, ధర్మవరం కౌన్సిలరు తీర్థల స్వర్ణలత, వలివేటి ఉమ, న్యాయవాది భాగవతుల లలితా శారద, చిలకలూరిపేట ధూళిపాళ్ల ఫౌండేషన్ చైర్మన్ ధూళిపాళ్ల రాజ్యలక్ష్మి, ఒంగోలు కార్పొరేటర్ నీలంరాజు సరోజను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర శైవాగమ సలహాదారు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్, సంగీత విద్వాంసుడు డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మను సత్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుసోత్తమశర్మ స్వాగతం పలికిన సభలో గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, సేవాసంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి యనమంద్ర సాయిసురేష్, కొత్తా వెంకట సుబ్బారావు, గుడిపాటి సీతారామ్, యల్లావుల జ్వాలా నరసింహమూర్తి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లగిరి కౌసల్య, కోశాధికారి దూపాటి శ్రీదేవి ప్రసంగించారు.

కళాకారిణి చింతలపాటి మంజులకు సత్కారం



చింతలపాటి మంజుల, జెట్టి రేణుకకు సత్కారం

తెనాలి: పట్టణంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సభలో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, నటించిన సినిమాలు, రాజకీయ జీవితంపై చర్చా వేదిక నిర్వహించారు. పెమ్మసాని పోతురోజు, జెట్టి రేణుక సినీ రంగంలో ఎన్టీఆర్ చేసిన ప్రయోగాలు అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ప్రముఖ రేడియో ఆర్టిస్ట్, ఆంధ్రా యూనివర్శిటీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ డిపార్ట్‌మెంటుకు చెందిన డాక్టర్ చింతలపాటి మంజులను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, ఉమ్మలనేని ధర్మారావు, సీఎస్ శ్రీనివాస్, సూరపనేని అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మవారు



వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

చందోలు(పిట్టలవాని పాలెం): మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఫాల్గుణ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది.

14న హోమం..

బండ్లమ్మవారి దేవాలయంలో ఈ నెల 14న ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ప్రతి మంగళవారం వివాహం కాని యువతులకు, ప్రతి శుక్రవారం వివాహం కాని యవకులకు హరిద్ర శృంగార్చన పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఏడు వారాలు పూజలు చేసిన.. యువతీయవకులు ఈ ప్రత్యేక హోమంలో పాల్గొనాలని తెలిపారు. సత్వర వివాహ ప్రాప్తి కలుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు కుంచల నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

వెండి వస్తువులు బహూకరణ

పిట్టలవానిపాలెం: బండ్లమ్మ దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఉప్పుటూరి వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు రూ.50 వేలు విలువల గల రెండు వెండి వస్తువులను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారికి వెండి పూజా పళ్లెం, తీర్థపు గిన్నె, ఉద్ధరిణెలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, ఇంటూరి నారాయణస్వామి కుటుంబ సభ్యులు, అర్చక స్వాములు కుంచల నరసారెడ్డి, ఆలయ సిబ్బంది కొండవీటి శ్రీనివాసరావు ఉన్నారు.

రథోత్సవానికి పటిష్ట బందోబస్తు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని సోమవారం జరిగే దివ్య రథోత్సవానికి రేపల్లె డీఎస్పీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వేమూరు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఇందుకోసం చుండూరు, రేపల్లె, వేమూరు సర్కిల్ పరిధిలోని ఏడుగురు ఎస్ఐలు, వంద మంది పోలీస్ సిబ్బంది పనిచేయనున్నట్లు చెప్పారు.

రోప్ పార్టీని ఏర్పాటు చేసి, రథంపై నలుగురికి మించి ఉండకుండా చూస్తామన్నారు. రథం ముందు 15 అడుగుల దూరం వరకు భక్తులు ఉండకుండా తగు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. రథోత్సవానికి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఉండే విధంగా పంచాయతీ, ఆర్అండ్‌బీ, టెలికాం, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

వైభవంగా మల్లేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



కల్యాణ మూర్తులైన స్వామివారు



జగజ్యోతిలో నెయ్యిని సమర్పిస్తున్న భక్తులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యావపోసన, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు టీటీడీ సహకారంతో శ్రీ మల్లేశ్వర భక్త సమాజం ఆర్గనైజర్ కొతరపు గోపాల కృష్ణయ్య బృందం భజన కార్యక్రమం నిర్వహించింది. రాత్రి ఆలయంలో జగజ్యోతి, ఎదురుకోలు మహోత్సవం వైభవంగా జరిగింది. అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం శ్రీవారి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పించింది. స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో జగ్గారపు సూర్యనారాయణ, సామ్రాజ్యం దంపతులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మూర్తులైన స్వామివార్లకు గ్రామోత్సవం గావించారు. దివ్య రథోత్సం సోమవారం సాయంత్రం జరుగనున్నది. కార్యక్రమాలను దేవాలయ ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు వంశపారంపర్య ధర్మకర్తలు కొడాలి పానకాలు, రామశాస్త్రి, శంకరరావు, లక్ష్మీకాంతరావు, అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ సంఘీయులు పర్యవేక్షించారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని విశ్వనాథపల్లి తిరునాళ్ల మహోత్సవానికి భట్టిప్రోలు నుంచి ప్రత్యేకంగా టైరు బండ్లపై గూడును ఏర్పాటు చేసుకుని భక్తులు తరలి వెళ్లారు. ఏటా గ్రామస్తులు అధిక సంఖ్యలో ఈ తిరునాళ్లకు వెళ్లి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ.

‘ఛలో ఢిల్లీ’.. తరలిరావాలి

తెనాలి: అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహా సంఘర్షణ, కార్మిక, కర్షక ర్యాలీకి తరలి రావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. రూరల్ మండలం జగ్గడిగుంటపాలెంలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 65 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌పరం చేసేందుకు తెచ్చిన మూడు నల్లచట్టాలు, విద్యుత్ బిల్లు రద్దుకు రైతు సంఘాలు 13 నెలలు చరిత్రాత్మక పోరాటం చేసినట్లు గుర్తుచేశారు. రైతుల ఉద్యమానికి తలొగ్గిన కేంద్రం చట్టాల రద్దు ప్రకటించి కూడా దొడ్డిదారిన అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా రైతు, కౌలు రైతు, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాని కోరారు. ముద్దన సాంబశివరావు, తాటి వెంకటేశ్వర్లు, కరేటి వెంకటరమణ, దొడ్డక మల్లికార్జున రావు, తట్టుకూళ్ల రవీంద్ర, బసవశంకరరావు, డి.నాగేశ్వరరావు, గోపాలరావు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై తనిఖీలు



అనుమానిత ప్రాంతంలో తనిఖీ చేస్తున్న ఎస్సై రవీంద్రరెడ్డి

కొల్లిపర: గంజాయి అమ్మటం, తీసుకోవడం చట్టరీత్యా నేరమని అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్.రవీంద్రరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గంజాయి అమ్మకాలపై పోలీసులు దృష్టి సారించారు. అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ శ్యామ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో కొలువైన శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి నిత్య హోమం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి ఎదురుకోలు ఉత్సవం, కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. దివ్య రథోత్సవం సోమవారం జరగనుంది. కల్యాణ దాత కొల్లిపర రామేశ్వరలింగం, ధర్మకర్త దోరగచర్ల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. ఈఓ ఈమని అశోక్‌రెడ్డి పర్యవేక్షించారు.

సాయిబాబాకు వెండి వస్తువులు బహూకరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ షిర్డీ సాయిబాబాకు పలువురు దాతలు రూ.1.70 లక్షల వ్యయం చేసే వెండి జల్లెడ, శంఖుధార, పాదుకలు, శ్రీ దత్తాత్రేయులకు పాదుకలు, పద్మపీఠం బహూకరించారు. గ్రామానికి చెందిన పురోహితులు పాతూరి కాంతారామశర్మ కుమారుడు నాగసాయిబాబ, తమ్మన వెంకట సుబ్బారావు, పేర్ల శ్రీనివాసరావు వీటిని ఆదివారం సమర్పించినట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు తెలిపారు. అర్చకులు చావలి రాంబాబు వాటికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొలిశెట్టి బాలకృష్ణమూర్తి, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీబాల త్రిపురసుందరి అమ్మవారికి బంగారు గొలుసు విరాళం

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలోని శ్రీ అమృతేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారికి దాతలు రూ.2 లక్షలు విలువ చేసే బంగారపు కాసుల గొలుసుని ఆదివారం అందజేశారు. కారుమంచి స్వర్ణలత కుమారుడు వెంకట కృష్ణ ప్రసాద్, భాగ్యలక్ష్మి దంపతులు, కుమార్తె, అల్లుడు డాక్టరు మైనిక, సాయికిరణ్ గొలుసును అందజేశారు. పావులూరి రత్నాంబ, మల్లిపెద్ది కమలమ్మ, పరుచూరి ఉదయలక్ష్మి, కొత్తపల్లి శార్వాణి, మైనేని బాలవాణి, వెనిగళ్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయం పరిశుభ్రం..

తెనాలిటౌన్: పట్టణంలోని నెహ్రూ రోడ్డులో ఉన్న శ్రీ రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఆదివారం ఆంజనేయం యోగా మండలి సభ్యులు సందర్శించి, శుభ్రం చేశారు. మండలి వ్యవస్థాపకుడు కేవీఎన్ కిషోర్ గురూజీ పర్యవేక్షణలో సభ్యులు తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో బూజు దులిపి, కల్లాపు చల్లారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. కిషోర్ గురూజీ దేవాలయ పరిశుభ్రత, ప్రకృతి ఉపాసన ధ్యానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ఈఓ మల్లీశ్వరి, వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తిని మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, సీహెచ్ నాగేశ్వరరావు, కోమల మాతాజీ, జానకి మాతాజీ, సాయి వెంకట్, యోగా మండలి సభ్యులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శివనాగేశ్వరరావు

తెనాలిటౌన్: కొలవరం ఎస్టీ కాలనీలోని 30మంది చిన్నారులకు నూతన దుస్తులను వైఎస్సార్ సీపీ నాయకుడు శివనాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ ఆదం షఫీ ఆదివారం పంపిణీ చేశారు. తన నాయనమ్మ షేక్ జాన్‌బీ ప్రథమ వర్ధంతి సందర్భంగా దుస్తులు అందజేసినట్లు ఆదం షఫీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ మంచాల శ్రీనివాసరావు, నాయకులు ఎల్‌బీసీ చిన్ని, తమ్మా శివారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, షేక్ బాబు, షేక్ నాగురా, మీరారెడ్డి, హేమచంద్రరావు, దేవయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో కుంకుమ పూజలు



తెనాలిటౌన్: బాలాజీ రావుపేటలోని అయ్యప్ప ఆలయంలో వేంచేసియున్న అష్టభుజ దుర్గమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు దుర్భా హరిబాబు స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అష్టభుజ దుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



కొల్లూరు: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. మండలంలోని గాజుల్లంకలో చందన రాధాకృష్ణమూర్తికి చెందిన ఇంటిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అప్రమత్తం చేయడంతో.. ఇంట్లో ఉన్న వారు బయటకు పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు వారు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. నగదుతో పాటు, కొంత బంగారం, సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు వారు ఫిర్యాదు చేశారు.

పెసర్లంక తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

కొల్లూరు: మండలంలోని పెసర్లంక నాంచారమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. సమీపంలోని శివాలయం ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రులో కొలువైన శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి గరుడోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు దీవి శరత్‌కుమార్, జగన్నాథ కృష్ణమాచార్యులు, రాంబాబు శాస్త్రయుక్తంగా చేశారు. మంగళవారం రథోత్సవం జరుగుతుందని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంఠమనేని హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమాలను ఈఓ మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

జన ఔషధి దుకాణాలను సద్వినియోగం చేసుకోండి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలిటౌన్: ప్రజలకు అవసరమైన మందులను తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జన ఔషధి దుకాణాలను తీసుకొచ్చిందని తెనాలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మంగమ్మ తెలిపారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన వారోత్సవాల సందర్భంగా ఆదివారం లక్ష్మీథియేటర్ సమీపంలోని జనరిక్ మందుల దుకాణం నిర్వాహకుడు ఏడుకొండలు సారథ్యంలో ఉచిత ప్రజా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డి.శారద, వినీల్, రాఘవేంద్రరావు, వినయ్, అంజలి క్రిస్టినా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మంగమ్మ సందర్శించారు. మార్చి 1 నుంచి 7 వరకు జన ఔషధి వారోత్సవాలు జనరిక్ మందుల దుకాణాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, భార్గవ్, జ్యోతి, పద్మావతి, రమాదేవి, అఖిల్, సన్ని, మందుల దుకారణం సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

తెనాలిటౌన్: పట్టణంలోని సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు శారద సర్వీస్ సొసైటీ, కుమార్ పంప్స్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ శారద వైద్య పరీక్షలు నిర్వహించారు. స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వయంకృషితో రాజకీయాల్లో రాణించిన డొక్కా



జన్మదిన కేకును కట్ చేస్తున్న ఉత్సవ కమిటీ

తెనాలి: స్వయంకృషితో రాజకీయాల్లో రాణించి, ఉన్నత పదవులను అందుకున్న నిస్వార్థ రాజకీయవేత్త డొక్కా మాణిక్యవరప్రసాద్ అని సాహితీరత్న నూతక్కి ప్రజ్ఞాచారి అన్నారు. రూరల్ మండలం కొలకలూరులోని బాబూ జగ్జీవన్‌రామ్ రేడియో అండ్ రీడింగ్ రూమ్ ఆవరణలో ఆదివారం మధుర కవి నూతక్కి అబ్రహం శతజయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ జన్మదిన వేడుకను నిర్వహించారు. కేక్ కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. ఏ స్థాయిలో ఉన్నా జాతిని మరువలేదనీ, జాషువా సాహిత్య కృషి ప్రచారం చేశారని తెలిపారు. పాత్రికేయుడు నూతక్కి అచ్యుతాచారి, కావూరి రవి, సుద్దపల్లి కనకరాజు మాట్లాడారు. సుద్దపల్లి ప్రశాంత్, గొరికపూడి నిఖిల్, సిద్దెల ఇమ్మానుయేలు, సుద్దపల్లి యెహోవా, ఉన్నం రాజశేఖర్, ఉన్నం సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి



గాయకుడు వైఆర్ శాస్త్రికి సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీ కళారంజని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఘంటసాల సంగీత విభావరి–2 ఘనంగా జరిగింది. పాటల ప్రేమికుడిగా ప్రజాదరణ పొందిన హైదరాబాద్‌కు చెందిన వైఆర్ శాస్త్రి తన మధురగానంతో ఘంటసాల పాటలను ఆలపించారు. ప్రారంభ సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతి అధ్యక్షత వహించారు. గాయకుడు వైఆర్ శాస్త్రి మాట్లాడుతూ సంగీతంతో పాటు సాహిత్యపు విలువలున్న పాటలనే వేదికపై పాడేందుకు తాను ఇష్టపడతానని చెప్పారు. ఆత్మీయ అతిథి ఆచార్య మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్ చేసిన వైఆర్ శాస్త్రి, ప్రభుత్వ సంస్థలో ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరుగా పనిచేశారని, పాటలు పాడటం ఆయన ప్రవృత్తి మాత్రమేనని చెప్పారు. గానకోకిల పి.సుశీలతో కలిసి అమెరికాలో అనేక కార్యక్రమాల్లో పాటలు పాడారని వివరించారు. సంగీత విభావరి అనంతరం శ్రీకళారంజని నిర్వాహకులు శాస్త్రిని ఘనంగా సత్కరించారు. వాకా పేరిరెడ్డి, గోనుగుంట్ల మురళీకృష్ణ, వాకా కరుణ, సాయిప్రణీత్, వంశీకృష్ణ, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘వైఎస్సార్’ స్మారక సైక్లింగ్ పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక స్పీడ్ సైక్లింగ్ పోటీలు ఆదివారం ప్రశాంతగా ముగిశాయి. బాపట్ల జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుంచి మొత్తం 27 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒక్కో రౌండుకు తొమ్మిది మంది చొప్పున మూడు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. వారిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన ఆరుగురికి ఫైనల్స్ నిర్వహించారు. చందోలు నుంచి ప్రాంభమైన సైక్లింగ్ రెడ్డిపాలెం, పిట్టువారిపాలెం, ఖాజీపాలెం, అలకాపురం, అల్లూరు రెడ్లపాలెం, పిట్టలవానిపాలెం మీదగా తిరిగి చందోలుకు చేరుకుంది.

బహుమతుల ప్రదానం..

ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన పిట్టు వెంకటేశ్వరరెడ్డి, అక్కల వెంకటరెడ్డిపాలేనికి చెందిన పిట్టు వెంకటశివారెడ్డి నిలిచారు. వీరికి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి రూ.20వేలు, ఎంపీపీ షేక్‌బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్ రూ.15వేలు అందజేశారు. మిగిలిన స్థానాల్లో వరుసగా.. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన అబ్దుల్ సుబాని, ఎస్కే మౌలాలి, చెరుకుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన పాలపర్తి దిలీప్ కుమార్, పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన కోనేటి మహేంద్ర నిలిచారు. వీరికి వైస్ ఎంపీపీ దెందుకూరి(రూ.12వేలు), గోవతోటి సురేఖ విజయ్(రూ.10వేలు), చందోలు సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి మునీర్, ఉప సర్పంచ్ చేబ్రోలు వీరయ్య(రూ.7వేలు), అప్సర కూల్‌డ్రింక్స్ ముజీబుల్ రెహమాన్(రూ.5వేలు) వరుసగా నగదు బహుమతులు అందజేశారు. నగదు, షీల్డులను నిర్వాహకులు జుల్ఫాఖార్‌బేగ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శేషగిరారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. సైక్లింగ్ పోటీలు నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చందోలు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు పాల్పడిన గోరిపర్తి శ్రీనుతో రూరల్ పోలీసులు

బాపట్లటౌన్: ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సూర్యలంక సముద్రతీరంలో ఆత్మహత్యకు పాల్పడిన యువకుడిని రూరల్ పోలీసులు కాపాడి, చికిత్స కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ వెంకటప్రసాద్ వివరాల మేరకు.. నిజాంపట్నం మండలం పలపట్ల గ్రామానికి చెందిన గోరిపర్తి శ్రీను.. వ్యక్తిగత సమస్యల కారణంగా.. మనస్థాపం చెంది సూర్యలంక సమీపంలోని అటవీప్రాంతంలో చేయి కోసుకుని, ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, స్విమ్మర్స్‌సురేష్, కానిస్టేబుల్ ఆంజనేయులు అతనిని కాపాడి, బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించినారు.